చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు

ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర

- అద్దె బస్సులతో అధోగతి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- కార్మికులను అణచివేసే చర్యలు మానుకోవాలి
- 'చలో బస్‌భవన్'లో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు అద్దె బస్సుల పేరుతో ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ నేతలు విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని చెప్పి మరిచిపోయిందని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ ట్యాక్స్‌ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఆర్టీసీ డ్రైవర్ల సంఖ్యను పెంచితే తెలంగాణలో మాత్రం కుదిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను తీసేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీలో 12 నుంచి 16 గంటల పాటు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సరఫరా చేయాలని కన్వీనర్ మౌలానా పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కో-కన్వీనర్ కత్తుల యాదయ్య కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డు ఇవ్వాలని సుద్దాల సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కమలాకర్‌రెడ్డి, బీ యాదగిరి, వివిధ జిల్లాల ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

తాగినడిపితే లైసెన్స్ రద్దే..

- అతివేగంగా, అధిక లోడ్‌తో వెళ్తే లైసెన్స్ క్యాన్సిల్
- నిబంధనలు మరింత కట్టుదిట్టం
- డేటాబేస్ ఆధునీకరణకు రవాణా, పోలీస్ శాఖల చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): మద్యం తాగి వాహనం నడిపితే వాహనదారుడిపై కేసు నమోదుతో పాటు లైసెన్స్ రద్దు కానున్నది. అధిక వేగం, బరువుతో గూడ్స్ వెహికల్స్ నడిపినా లైసెన్స్ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు. ఏడాదిలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. ఇందులో ఎక్కువగా డ్రంక్ అండ్ డైవ్ కేసులే ఉన్నట్టు తెలిపారు. ఒకే వ్యక్తి మూడు సార్లు మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసులు రవాణాశాఖకు సిఫార్సు చేయనున్నారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు రవాణా, పోలీస్ శాఖలు డేటాబేస్‌ను ఆధునికరించాలని యోచిస్తున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఫోటో లేదా ఆధార్ నంబర్ డేటాబేస్‌తో కనెక్ట్ చేయడంతో లైసెన్సు నంబర్, ఎక్కడ తీసుకున్నది క్షణాల్లో అధికారులకు తెలిసిపోనున్నది. దీంతో రవాణాశాఖ సులభంగా లైసెన్స్ సస్పెన్షన్ చేపట్టనున్నారు.

ఎమ్మెల్యే ఆర్డర్..అనుమతులున్నా బుల్డోజర్

- విమర్శలకు తావిస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారుల తీరు
- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు.. పనుల అడ్డగింత
- అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో బిల్డర్ వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో చెలరేగుతున్న ఓ అక్రమార్కుడితో చేయి కలిపి శేరిలింగంపల్లి జోన్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కష్టార్జితంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులు పొందిన ఓ యజమానిని వివాదస్పద బిల్డర్ కోసం వేధించడం చర్చనీయాంశమవుతున్నది. గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలాన్ని వీ దేవరాజ్, వీ కల్యాణి పేరుతో 2022 సంవత్సరంలో జీహెచ్ఎంసీకి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. అంతా పరిశీలించాక టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఇటీవల దేవరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే కాలనీ హౌజింగ్ సొసైటీపై పెత్తనం చలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్‌రావు కన్ను ఈ స్థలంపై పడింది. అక్కడి నుంచి పనులను అడ్డుకోవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో దేవరాజ్ గత నెల 27న శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే(అధికారపార్టీ) అండతో శ్రీధర్‌రావు చెలరేగిపోయాడు. ఆయన ఆదేశాలతో అధికారులు దేవరాజ్ నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇందేంటని ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు అందిందని అనుమతినిచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. ఈ క్రమంలో దేవరాజ్‌పై తరచూ వేధింపులు ఎక్కువయ్యాయి. అన్ని అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పనులు మొదలుపెడితే కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మాణ పనులు అడ్డుకుని, ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

ద్రోహి సమాచారంతోనే ఎన్‌కౌంటర్

- విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు
- కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు బాధ్యత వహించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 9న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

ములుగు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈ నెల 1న ములుగు జిల్లా చెల్పాక వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి చంపారని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30న ఏడుగురితో ఉన్న దళం చెల్పాక పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామంలో నమ్మిన వ్యక్తికి భోజనాలు ఏర్పాటు చేయమని కోరారని తెలిపారు. అప్రూవర్‌గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారని చెప్పారు. చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు కాల్చి చంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రజాస్వామికవాదులు, విద్యాలయాలు, వ్యాపారసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, బాధ్యత వహించి, న్యాయ విచారణ జరిపి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 5 : మావోయిస్టులు ఇద్దరు మాజీ సర్పంచ్‌లను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు సుఖ్‌రామ్ ఆవ్‌లం, సుక్లు ఫర్సాను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో వారిని హత్య చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటన బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

'మెగాఫుడ్ పార్క్' సభ వెలవెల

- పాగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- విసుగెత్తిన ప్రజలు.. సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన వైనం

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : ఖమ్మం జిల్లా బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు సభ నుం లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడంతో ప్రజలు వెళ్లిపోయారు.

సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మధ్యలోనే వెళ్లిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

హోంగార్డులకు నో 'రైజింగ్'

- ఏటా జరిగే కార్యక్రమాలకు సైతం మంగళం
- అడ్రస్‌లేని కవాతు, స్పోర్ట్స్‌మీట్, ప్రశంసాపత్రాలు
- అమరజవాన్ల త్యాగాలను అవమానించినట్టే
- నేడు హోంగార్డుల 75వ రైజింగ్‌డే

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఓ వైపు రాష్ట్రంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ 75వ రైజింగ్‌డేను గాలికి వదిలేసిందని హోంగార్డులు వాపోతున్నారు. దేశంలో హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమై 75 ఏండ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 6న ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన స్వర్ణోత్సవాలను ప్రభుత్వం, పోలీసుశాఖ గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. ఒక్క రక్తదానం మినహా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర హోంశాఖ సిద్ధంగా లేదని రాష్ట్రంలో హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల రైజింగ్‌డే రోజున ప్రతియేటా కవాతు, స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహించి తమను ప్రోత్సహించేవారని, ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు, ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు ఇచ్చేవారని, ఆరోజు తమకు భోజన ఏర్పాట్లు కూడా చేసేవారని చెప్తున్నారు. తాము ఎంతగానో నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇలా గాలికి వదిలేయడం ఆవేదనకు గురిచేస్తున్నదని అంటున్నారు. ఇది విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన వారిని అవమానించడమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసి, అన్ని జిల్లాల్లో ఘనంగా హోంగార్డుల రైజింగ్‌డేను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

హోంగార్డుల సమస్యలపై పట్టింపేదీ?

'అటెండర్‌కు ఎక్కువగా.. పోలీసుకు తక్కువగా' డ్యూటీలు చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలని, 600కు పైగా ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. అలాగే హోంగార్డుల సాధారణ మరణానికి రూ.5 లక్షల నగదు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్టు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించాలని, ఆరోగ్య భద్రత తమకు కూడా వర్తింపచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

బ్లాంకెట్లు పంపిణీ చేస్తున్న కాసం ఫ్యాషన్స్ షోరూం నిర్వాహకులు

బ్లాంకెట్ల పంపిణీ

జమ్మికుంట, డిసెంబర్ 5 : జమ్మికుంటలో కాసం ఫ్యాషన్స్ షోరూం ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు, దివ్యాంగులకు గురువారం బ్లాంకెట్లు పంపిణీ చేసినట్లు కాసం చైర్మన్ నమశ్శివాయ తెలిపారు. ఈ ఏడాది చలి అతిగా ఉండడంతో పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అలాగే రైల్వేస్టేషన్, బస్టాండ్, పార్క్, ఫుట్ పాత్‌ల దగ్గర సేద తీరుతున్న వారికి కూడా బ్లాంకెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌చార్జి యాంసాని ప్రవీణ్ తెలిపారు. జమ్మికుంట, ఇల్లంతకుంట, కొత్తపల్లిలోని వృద్ధాశ్రమం, వికలాంగులకు అందజేసినట్లు తెలిపారు.

భూమిని కాపాడితేనే భవిష్యత్‌కు మనగడ

చిగురుమామిడి, డిసెంబర్ 5 : భూమిని కాపాడుకుంటేనే రైతులకు మంచి దిగుబడి వస్తుందని, భూమి కాపాడేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజులనాయుడు అన్నారు. మండలంలోని చిన్న ముల్కనూర్‌లో ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం పురస్కరించుకొని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూమిలో సూక్ష్మజీవుల ప్రాముఖ్యత, పచ్చి రొట్ట, ఎరువుల వాడకం, భూసార పరీక్షతో కలిగే లాభాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) ప్రణయ్, రైతులు పాల్గొన్నారు.

రామడుగు, డిసెంబర్ 5 : మండలంలోని దేశరాజ్‌పల్లితో పాటు దాని అనుబంధ గ్రామం ఔదార్‌పల్లిలో గురువారం బీసీఐ నవకాంతి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఏపీయూఎం మాధవి మాట్లాడుతూ నేల ఆరోగ్యంతో పాటు, జీవ వైవిధ్యాన్ని, తేమ శాతాన్ని కాపాడుకోవడానికి నవధాన్య, పెసర, బొబ్బర్లు, ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్, వేస్టు డీకంపోసర్ వంటి స్థానిక పద్ధలను పాటిస్తూ భవిష్యత్ తరాలకు నేలను కాపాడుతూ పంటలు పండించాలన్నారు. బీసీఐ ఫీల్డు ఫెసిటేటర్స్ వనిత, రమేశ్, రాజ్‌కుమార్, చంద్రలీల, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి విజ్ఞాన్ మంతాన్ (వీవీఎం) లో రాష్ట్రస్థాయికి ఎంపిక

చిగురుమామిడి, డిసెంబర్ 5: ప్రతి సంవత్సరంలాగే ఈ విద్యా సంవత్సరం 2024-2025 లో దేశవ్యాప్తంగా విద్యార్థి విజ్ఞాన్ మంథాన్ పరీక్ష నవంబర్ 23, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించారు. రాష్ట్రంలో 5,312 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ పరీక్షకు హాజరయ్యారని, ఇందులో 128 మంది విద్యార్థులు రాష్ట్రంలోనీ వివిధ జిల్లాల నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లాల విద్యార్థి విజ్ఞాన్ మంథాన్ సమన్వయ కర్త భాష బత్తిని ఓదేలు కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి పారమిత హెరిటేజ్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న అన్యా రమేశ్, లారెల్ స్కూల్ నుంచి 10వ తరగతి చదువుతున్న అద్వైత్ వర్మ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ కావడం జరిగినదని, వీరు డిసెంబర్ 15వ తేదీ ఆదివారం నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ఘట్కేసర్, హైదరాబాద్ లో ప్రయోగాల పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఇందులో నుంచి జాతీయ స్థాయికి 10 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఓదెలు కుమార్ తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 5 : మత్తు పదార్థాలకు బానిస కాకుండా విలువలతో కూడిన జీవితాన్ని నిర్మించుకోవాలని విద్యార్థులకు హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ టీ శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని వికాస్ వొకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వినోద్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ విజేందర్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

వైద్య సిబ్బంది ఒత్తిడి తగ్గించుకోవాలి

- ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రతి ఒక్కరూ యోగా, వ్యాయామం చేయాలి
- జీజీహెచ్ సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి
- మృతి చెందిన సమ్మక్కకు ఘన నివాళులు

సమ్మక్కకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

విద్యానగర్, డిసెంబర్ 5 : వైద్య సిబ్బందికి పని ఒత్తిడి అవుతుందని, ప్రతి ఒక్కరూ దవాఖానలో నిర్వహించే యోగా కార్యక్రమాలకు హాజరై ఆరోగ్యంగా ఉండాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి అన్నారు. బుధవారం ఆకస్మికంగా మృతి చెందిన నర్సింగ్ ఆఫీసర్ సమ్మక్క చిత్రపటానికి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గురువారం పూలమాల వేసి, కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉండి మనమే ఆరోగ్యంపై అశ్రద్ధ చేస్తున్నామని, మనపై కుటుంబాలు ఆధారపడి ఉన్నాయనే విషయం మర్చిపోవద్దన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేసుకుని అవసరమైన మందులు, ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. రోజు యోగా, వ్యాయామం లాంటివి చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బంది ఎక్కువ మంది రక్త హీనతతో బాధపడుతున్నట్లు గుర్తించామని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. విశ్రాంతి, నిద్ర తప్పనిసరిగా ఉండాలన్నారు. నర్సింగ్ సిబ్బంది ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సమ్మక్క క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ నవీనా, వైద్యులు సాయిని నరేందర్, పద్మ, అలీం, దీప, నిర్మల, నర్సింగ్ సూపరింటెండెంట్లు గ్రేడ్-1 నిర్మల, గ్రేడ్-2 రాణి, సుభద్ర, సరిత, సరిత, హెడ్ నర్స్‌లు పద్మశ్రీ, సుజాత, మమత, కవిత, కల్పన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్న బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చేనేత జౌళి శాఖ జేడీ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ వెంకటేశ్వరరావు

గంగాధర, డిసెంబర్ 5: చేనేత, పవర్‌లూమ్స్ పరిశ్రమల్లో పనిచేసే నేత కార్మికులు నేతన్న బీమా పథకాన్ని సద్వినియాగం చేసుకోవాలని చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. గురువారం మండలంలోని గర్శకుర్తిలో చేనేత, పవర్‌లూమ్స్ కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత, పవర్ లూమ్స్ పరిశ్రమల్లో పని చేసే నేత కార్మికులు వృత్తిలో ఉన్నంత వరకు నేతన్న బీమా పథకాన్ని అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. చేనేత, పవర్ లూమ్స్ పరిశ్రమల్లో ఉత్పత్తి అవుతున్న గుడ్డకు అవసరమైన యారన్‌ను 10 శాతం చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. 2022 వరకు యారన్ సబ్సిడీని ప్రతి కార్మికుడికి అందించడం జరిగిందని, 2023 సంవత్సరానికి సంబంధించిన సబ్సిడీ పెండింగ్ లో ఉందని, త్వరలో అది కూడా క్లియర్ చేస్తామన్నారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ ఏడి విద్యాసాగర్, డివోలు హజార్, సంఘం అధ్యక్షుడు అలువాల విఠోభ, అన్నల్ దాస్ శ్రీనివాస్, గుండా రాజేశం, చిప్ప చక్రపాణి, గడ్డం నారాయణ పాల్గొన్నారు.

దుర్గేడ్‌లో ఘనంగా దివ్యాంగుల డే

చిన్నారులకు ర్యాలీ తీస్తున్న ఎంఈవో కే రవీందర్

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 5 : మండలంలోని దుర్గేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని దుర్గేడ్ కాంప్లెక్స్ స్కూల్స్‌లో గురువారం దివ్యాంగుల డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ మండల విద్యాధికారి కే రవీందర్ హాజరై మాట్లాడారు. అంగవైకల్యం శాపం కాదన్నారు. అనంతరం దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్, శ్రీలత, అప్ప చైర్మన్ సంధ్య, సీఆర్పీ రవీచంద్ర, వీ రమేశ్, అర్చన పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం తొలగిస్తానడం బాధాకరం

చొప్పదండి, డిసెంబర్ 5 : సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు తొలగించి, వేరే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానడం.. తెలంగాణ ప్రజలు అవమానంగా భావిస్తున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం ఇన్‌చార్జి బంధారపు అజయ్‌కుమార్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రజలను బెదిరించి పరిపాలిస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని మండిపడ్డారు.

అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు

సైదాపూర్, డిసెంబర్5: అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి అరెస్టులను ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 5: మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో భూపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. దివ్యాంగులు అంటే బలహీనులు కారు, విభిన్న సామర్థ్యాలు కలిగిన వారన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న విద్య, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ పథకాలపై ఆయన వివరించారు. వివిధ పాఠశాలల హెచ్ ఎంలు, సిబ్బంది, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు సరస్వతి విద్యార్థి

ఎంపికైన ప్రసన్నను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఉప్పల శ్రీనివాస్

రామడుగు, డిసెంబర్ 5 : డిసెంబర్ 3 నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలో గు రువారం అవినీతి నిర్మూలన పౌరుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో మండలంలోని వెలిచాల శ్రీ సరస్వతి పాఠశాలకు చెందిన ఎల్లమ్మల ప్రసన్న ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాంటెంట్‌తో పాటు కో కరస్పాండెంట్ సత్యం, ఉపాధ్యాయులు ప్రసన్నను అభినందించారు.

కార్పొరేటర్ భర్తకు కత్తిపోట్లు

రాంనగర్, డిసెంబర్ 5: అన్నదమ్ముల గొడవలో మధ్యవర్తిగా వెళ్లిన కార్పొరేటర్ భర్తను కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన కరీంనగర్‌లోని కశ్మీర్ గడ్డలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కాశ్మీర్ గడ్డకు చెందిన మహమ్మద్ ఆదిల్, అక్రమ్, అజాన్ అన్నదమ్ములు. వీరికి కుటుంబ తగాదాలున్నాయి. ఈ నెల 3వ తేదీన ఆదిల్‌ను ఇంటికి వెళ్లి అక్రమ్ అజాన్‌లు గొడవ చేసి కత్తితో పొడిచారు. ఆదిల్‌కు గాయమవడంతో స్థానిక కార్పొరేటర్ భర్త అయిన